డబ్బుల్లేవు... రేపు రండి

విశాలాంధ్ర-మంగళగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల పంపిణీ చేస్తున్న సామాజిక పెన్షన్లు పంపిణీ ఆలస్యంగా జరుగుతుంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వలంటీర్లను పాల్గొనవద్దని ఎన్నికల కమీషన్ ప్రకటించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేశారు. బుధవారం ఉదయం నుంచి పంపిణీ చేస్తారని ప్రభుత్వం ప్రకటించడం జరిగింది. మంగళగిరి పట్టణంలోని ఎనిమిదవ సచివాలయానికి పెన్షన్దారులు వెళ్లారు. డబ్బులు లేవు.. రేపు ఉదయం 6 గంటలకు రమ్మని సచివాలయ అడ్మిన్ సమాధానం చెప్పడం జరిగింది. దీంతో వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తూ వెనక్కిపోతున్నారు. టీవీలో, పేపర్లో ఈరోజు నుంచి పంపిణీ చేస్తామని ఎందుకు చెప్పుకొచ్చారని ప్రశ్నించారు.

టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు నియోజకవర్గం ఉమ్మడి కూటమి అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ బుధవారం పట్టణంలోని 9,10 వార్డుల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను తన అభ్యర్థిత్వాన్ని బలపరిచి టీడీపీ గుర్తు సైకిల్‌పై ఓటు వేసి అఖండ విజయం చేకూర్చాలని కోరారు. బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ, సూపర్ సిక్స్ పథకాల పాంప్లెట్లు అందించి వివరించారు. ప్రచారంలో పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

బ్రహ్మయ్యను హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర-మంగళగిరి : నాదెండ్ల బ్రహ్మయ్యను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ దళితబహుజనుల, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరి పట్టణ ంలోని టిప్పర్ల బజార్‌లో గల బ్రహ్మయ్య నివాసం వద్ద నిరాహార దీక్ష చేశారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ బ్రహ్మయ్య హత్య జరిగి నెలరోజులు కావస్తున్న ప్పటికీ పోలీసులు ఇంతవరకు నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు. పోలీసులు ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించారు. జన చైతన్య వేదిక నాయకులు లక్ష్మారెడ్డి, సీపీఎం నాయకులు ఎం.రవి, ఎస్ఎస్ చంగయ్య, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు కె.వినయ్ కుమార్, ఎస్.సురేష్, వై.కోటేశ్వరరావు, కె.బసవరాజు, ఏ.ప్రభాకర్ పాల్గొన్నారు.

నమోదైన అన్ని జనన, మరణాలను సీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం ఈ నెల 1వ తేదీ నుంచి జనన, మరణ రికార్డులను నిర్వహించాలని గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మీ బుధవారం పేర్కొన్నారు. ఆసుపత్రులలో నమోదైన అన్ని జనన, మరణాలను హెచ్ఎంఐఎస్, సీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

ప్రత్తిపాడులో వలంటీర్ల రాజీనామా

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : ప్రత్తిపాడులో వలంటీర్లు రాజీనామా చేశారు. 65 మంది వలంటీర్లు ఉండగా వారిలో సుమారు 52 మంది రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను వలంటీర్లు ఎంపీడీవో దుర్గాప్రసాద్‌కు అందించారు. తెలుగుదేశం పార్టీ తమను కించపరిచే విధంగా అవమానించేలా హేళన చేస్తూ మాట్లాడుతున్నారని వృద్ధులకు సేవలు అందించలేనప్పుడు తాము ఎందుకని అందుకే తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నామని తెలిపారు.

సర్వమత సామరస్యంగా ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర-గుంటూరు : ఇఫ్తార్ విందును సర్వమత సామరస్యంగా నిర్వహించడంపై గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అభినందనలు తెలిపారు. నగరంలోని 23వ డివిజన్‌లో నగరంపాలెంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు డాక్టర్ పెమ్మసాని బుధవారం పాల్గొన్నారు. అలాగే కులం, మతంతో సంబంధం లేకుండా అన్ని మతాల వ్యక్తులు కలిసి ఇఫ్తార్ విందులో భోజనాలు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. మాజీ కార్పొరేటర్ వర్ధనరావుతోపాటు నగర క్రిస్టియన్ సెల్ నాయకులు కారంగి అనిల్ కుమార్, గంటా పెద్దబ్బాయి, షరీఫ్, ఫణి తదితరుల ఆధ్వర్యంలో ఈ ఇఫ్తార్ విందును నిర్వహించారు.

వైసీపీకి తిప్పారెడ్డి రాజీనామా

విశాలాంధ్ర-గుంటూరు : గత కొద్దికాలంగా రైతులకు వ్యతిరేకంగా తీసుకుంటున్న విధానాల పట్ల, రైతుల పట్ల పార్టీ వ్యవహరిస్తున్న వైఖరి నచ్చక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ రైతు విభాగ రాష్ట్ర మాజీ కార్యదర్శి తిప్పారెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ముఖ్య అనుచరుడైన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయుడుగా, తాడికొండ నియోజకవర్గంలో కీలక నేతగా వ్యవహరించారు. త్వరలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని వెల్లడించారు.

సార్వత్రిక ఎన్నికలకు సీపీఐ సిద్ధం

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు : రానున్న సార్వత్రిక ఎన్నికలకు సీపీఐ సిద్ధంగా ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. దేశ సంపదను గుజరాతీ యులకు దోచిపెడుతున్న మోదీకి, ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా చేసిన జగన్‌మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పా లని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ మాయలో పడిన టీడీపీ, జనసేన, జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలు ఎవరు నమ్మే పరిస్థితుల్లో లేరని, ఇండియా కూటమి బలపరిచిన అభ్యర్థులను ప్రజలు గెలిపించుకోవడానికి సిద్ధంగా ఉన్నారని జంగాల ఆశాభావం వ్యక్తం చేశారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి లేకుండా చేస్తూ మతోన్మాద బీజేపీని, బీజేపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని, టీడీపీ, జనసేనలను రాబోయే ఎన్నికలలో ప్రజలు ఇంటికి సాగనంపాలని పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో గుంటూరు నగర సమితి సమావేశం నగర కార్యవర్గ సభ్యులు మంగా శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ముఖ్యఅతిధిగా హాజరైన జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మతోన్మాదవాదుల దౌర్జన్యాలు పెట్రేగిపోయాయని, అలాగే అదాని, అంబానీ, ఆస్తులు అమాంతం పెరిగిపోయాయని అన్నారు. నరేంద్ర మోదీ నియంతృత్వ ధోరణి వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ వెనుకబడిపోయిందని, ఇష్టం వచ్చినట్లు పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు పెంచుకుంటూ పోతూ దేశాన్ని సర్వనాశ నం చేస్తున్నారని మండి పడ్డారు. నరేంద్ర మోదీని దేశం నుంచి తరిమికొట్టాలని, మోదీ చేతిలో పావులుగా మారిన టీడీపీ, జనసేన, జగన్‌మోహన్ రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమికొట్టి దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడాలని ప్రజలకు జంగాల పిలుపునిచ్చారు. టీడీపీకి, జనసేనకి, వైసీపీకి ఓట్లు వేస్తే మోదీకి వేసినట్టేనని, వారికి అధికారం ఇస్తే దేశాన్ని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని కాపాడాలంటే ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నగర కార్యదర్శి కోట మాలాద్రి మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఇండియా కూటమి గెలుపుకు వాడవాడలా కృషి చేస్తామని, ప్రజలు ఈ ఎన్నికల్లో ఆలోచించి ఓట్లు వేయాలని, మతోన్మాద బీజేపీని, రాష్ట్రాన్ని అభివృద్ధి లేకుండా మరో బీహార్‌లా తయారుచేసిన వైసీపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

ఇండియా కూటమి అభ్యర్థి జొన్న శివశంకర్‌ను గెలిపించండి

విశాలాంధ్ర-తాడేపల్లి : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని, విభజన హామీలు అమలు చేయని బీజేపీకి రాష్ట్రంలోని అధికార ప్రతిపక్షాలు మద్దతివ్వడం సిగ్గుచేటని మంగళగిరి ఇండియా కూటమి అభ్యర్థి జొన్న శివశంకర్‌రావు అన్నారు. బుధవారం తాడేపల్లి సీపీఐ కార్యాలయంలో సీపీఐ నాయకులను సీపీఎం నాయకులు కలిశారు. ఇండియా కూటమి అభ్యర్థి జొన్న శివ శంకరరావు మాట్లాడుతూ జాతీయ వనరులన్నింటిని కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా బీజేపీ ప్రభుత్వం అమ్ముతోందని విమర్శించారు. రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, కడప స్టీల్ ఫ్యాక్టరీ, దుగ్గరాజుపట్నం పోర్టు, కేంద్ర విద్యా సంస్థలు ఇవేవీ కూడా అమలు చేయకుండా అన్యాయం చేసిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడం, లౌకికత్వాన్ని రక్షించుకోవడం, ఈ దేశంలో మతసామరస్యాన్ని కాపాడుకోవడం కోసం ఇండియా బ్లాక్‌గా ఏర్పడడం జరిగిందని అన్నారు. బీజేపీ పాలనలో ధరలు విపరీతంగా పెరిగి ప్రజల జీవనం దుర్భరమైందన్నారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లా డుతూ బీజేపీ దేశ ఐక్యతకు భంగం కలిగే విధంగా మత ఘర్షణలు సృష్టిస్తోందని మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అత్యంత నిరంకుశంగా, ప్రజాకంటకంగా మారిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే ఈ ఎన్నికల్లో అంతిమ లక్ష్యమని అన్నారు. మంగళగిరిలో ఇండియా కూటమి అభ్యర్థులైన జొన్న శివశంకరరావుకి సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుపై, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి జంగాల అజయ్ కుమార్‌కి కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, మాణికొండ దాంగే, మునగాల రామారావు, గుంటక సాంబిరెడ్డి, జి.శివ, షేక్ బాషా, క్రరి సురేష్, దొంత కోటేశ్వరరావు, కాశీం, శీలం అనిల్, శ్యామ్, సీపీఎం నాయకులు దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, బూరగ వెంకటేశ్వరరావు, కొట్టె కరుణాకర్‌రావు, వేముల దుర్గారావు, సోలా ముత్యాలరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ప్రభుత్వ బాధ్యత

విశాలాంధ్ర-తాడేపల్లి: పింఛన్ల పంపిణీ విషయంలో లబ్దిదారులందరికీ ఇళ్ల వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరావు యాదవ్ కోరారు. బుధవారం తాడేపల్లి 12వ సచివాలయంలో టీడీపీ నాయకులతో కలసి వినతిపత్రం అందచేశారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో దానబోయిన సుందరరావు యాదవ్ మాట్లాడుతూ సామాజిక పింఛన్ల పంపిణీ అనేది ప్రభుత్వ బాధ్యత అని ఆ బాధ్యతను సీఎం జగన్ సక్రమంగా నిర్వహించకుండా దురుద్దేశంతో వయోవృద్ధులు, దివ్యాంగులను అవస్థల పాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ చేతగానితనాన్ని కప్పిపుచ్చు కునేందుకు విపక్షాలపై నేపాన్ని నెట్టేస్తు న్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్ దారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెన్షన్ పంపిణీ చేయాలని కోరారు. టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, అద్దంకి మురళి, మండవ గోపాలరావు, జి.నాగేశ్వరరావు, టి.గోపి, అన్నెం కుసుమ, మొండితోక కళ్యాణి, పద్మ, మాలిక, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పరిశ్రమ కూలీలకు కనీస సదుపాయాలు కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు : ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చి యార్డ్ గుంటూరే అని, దాని మీద ఆధారపడి కొన్ని వేల మంది జీవిస్తున్నారని, వారికి కనీస సదుపాయాలు కూడా లేవని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి గల్లా మాధవి ఆవేదన వ్యక్తం చేసారు. బుధవారం గుంటూరు శ్రీరామ్ నగర్‌లోని మిర్చి పరిశ్రమ కూలీలను మాధవి కలుసుకొని, వారితో మమేకమై ముచ్చటించారు. ఈ సందర్భముగా మహిళా కూలీలు తమ సమస్యలను ఏకరవుపెట్టారు. ఈ మిర్చి పరిశ్రమలో పనిచేసే వారికి 45 ఏళ్లకే గుండె పోటు వంటి సమస్యలను ఎదురుకుంటున్నారు. అనేకమందికి సొంత నివాసాలు కూడా లేవని, కూలీ డబ్బులతోనే తమ కుటుంబ నడపాలంటే బ్రతుకు భారం అవుతున్నదని తెలుపగా మీకు నేను అండగా ఉంటానని మాధవి హామీనిచ్చారు. కార్యక్రమంలో పేరం అనిత, కురంగి షాహిద్ బాబు, దాసరి జ్యోతి, చెంబేటి మణికుమారి, దొంత నాగ సుశీల పాల్గొన్నారు.

ఇంజనీర్ నాగమల్లేశ్వరరావుకు అభినందన వీడ్కోలు

విశాలాంధ్ర- తెనాలి : తెనాలి మున్సిపల్ ఇంజనీరుగా పనిచేసిన కొడాలి నాగమల్లేశ్వరరావును తెనాలి మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగమల్లేశ్వరరావు తనకు జరిగిన అభినందనకు కృతజ్ఞతలు తెలుపుతూ ఇలాంటి సన్మానాలు, సత్కారాలు సహజమేనని, కాని ప్రతి ఒక్కరూ సమాజం కోసం సమాజ సాంప్రదాయాల కోసం కృషి చేయాలని చెప్పారు. కుల మత తారతమ్య బేధాలు లేకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ కలిసివుండే రీతిలో ప్రజలను తీర్చిదిద్దాలని చెప్పారు. కార్యక్రమంలో ఇంజనీర్ సహచరులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటిస్తూ ప్రచారాలు నిర్వహించుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటిస్తూ ప్రచారాలు నిర్వహించుకొని ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కోరారు. బుధవారం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజకుమారి, కమీషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజాతో కలసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ప్రార్ధనా మందిరాలలో ప్రచారాలు నిర్వహించవద్దని, పార్టీ కండువాలతో వెళ్ళవద్దని సూచించారు. మైక్ పర్మిషన్ తీసుకున్న ప్రాంతాల్లో కాకుండా వేరే ప్రాంతాల్లో మైక్ ఎనౌన్స్మెంట్ చేయరాదని, రాత్రి పది గంటల తరువాత ప్రచారాలు ఆపి వేయాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, ఏ.లక్ష్మీకుమారి, అదనపు కమిషనరు కే.రాజ్యలక్ష్మీ, ఈఆర్ఓ లు పాల్గొన్నారు.

ఇండియా బ్లాక్‌ను గెలిపించండి

విశాలాంధ్ర-తెనాలి : పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్థానంలో అధ్యక్ష తరహా పాలన తేవడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని, ఈ దేశంలోని కార్పొరేట్ కంపెనీలతో బంధం ఏర్పర చుకుందని, కుట్రలు కుయుక్తులు పన్ని తమ స్వార్థం కోసం ప్రయత్నం చేస్తున్నారని దానిని తిప్పి కొట్టేందుకు ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని బీజేపీ, దానికి వత్తాసు పలుకుతున్న తెలుగుదేశం, జనసేన పార్టీలను ఎన్నికల్లో ఓడిం చాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె.బాబుప్రసాద్ తెలిపారు. బుధవారం తెనాలి చెంచుపేటలోని సీపీఎం ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయాలు, హాస్పటల్స్ ప్రైవేటు రంగానికి బదలాయిస్తు న్నారని, వ్యవసాయ రంగం కుదేలైందని, రైతుల భూములు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్ళడానికి బీజేపీ చట్టాలుచేసిందని తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థలు స్వతంత్రంగా పనిచేసే పరిస్థితి లేకుండా పోయిందని ఎలక్షన్ బాండ్ల రూపంలో కొత్తరకం అవినీతికి బీజేపీ కృషి చేస్తుందని చెప్పారు. ప్రజలు ఇది గమనించి ఆ పార్టీలను ఓడించాలని పిలుపు నిచ్చారు. ఈ రాజకీయ పరిస్థి తులపై సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ ఇతర పార్టీలు కలిసి ఇండియా బ్లాక్ ఏర్పడిం దని ఆ పార్టీకి ఆ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సాంబిరెడ్డి, హుస్సేన్‌వలి, జోనేష్, వందన పాల్గొన్నారు.

ఓటర్లను ప్రలోభపరిచే నగదు, మద్యం, బహుమతులు పంపిణీపై నిరంతరం తనిఖీలు నిర్వహించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛయుత వాతవారణంలో జరిగేందుకు ఓటర్లను ప్రలోబపరిచే నగదు, మద్యం, ఉచిత బహుమతులు పంపిణీపై ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలు నిరతరం నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించి అరికట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగం సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు నీనా నిగం, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, రిటర్నింగ్ అధికారులు, ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు, నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు, అక్కౌంటింగ్ బృందాలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలోని అసెంబ్లీ నియోజకవర్గాలు నగదు, మద్యంకు సెన్సిటీవ్ అని అక్రమంగా మద్యం, నగదు తరలింపును జరగకుండా అడ్డుకోవటంతో పాటు అభ్యర్థులు నిర్దేశించిన వ్యయపరిమితి మించకుండా నిరంతరం పరిశీలన చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా ఉన్న నగదు లావాదేవీలు, మద్యం, ఉచిత బహుమతులను సీజ్ చేయాలన్నారు. సమావేశం అనంతరం కలె క్టర్ కలెక్టరేట్ లోని ఎన్నికల కంట్రోల్ రూంలోని ఎంసీసీ, సీవిజిల్, ఈఎస్ ఎంఎస్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాల రియల్ టైం మూమెంట్, ఈటీబీఎస్, సక్షమ్, ఎన్కోర్, సువిధా మానిటరింగ్ విభాగాల పనితీరును వివరించారు.

లోకేష్‌కి, లావణ్యకి ఓటు అడిగే హక్కు లేదు

విశాలాంధ్ర-తాడేపల్లి : మంగళగిరిలో నారా లోకేష్‌కి మురుగుడు లావణ్యకి ఓటు అడిగే హక్కు లేదని జై భీమ్ రావు భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ అన్నారు. తాడేపల్లి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు, జగన్‌లను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్, చంద్రబాబు మాత్రమే పరిపాలన చేయాలా అని ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వంలో నారా లోకేష్ అవినీతికి పాల్పడి డబ్బును దోచేశారని దోచుకున్న డబ్బుతో మంగళగిరిలో పంచి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. నారా లోకేష్, మురుగుడు లావణ్య మంగళగిరికి ఏం చేశారని చెప్పాలని డిమాండ్ చేశారు. వారికి ఓటు అడిగే హక్కు లేదని అన్నారు. కరోనా సమయంలో 2019 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేస్తున్నామని అన్నారు. అమరావతి రైతుల కోసం పేదల కోసం నిరంతరం పోరాటం చేసే పార్టీ జై భీమ్ రావు భారత్ పార్టీ అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కేవలం ఓటు బ్యాంకుగా మిగిలిపోకూడదన్నారు. ఓటును అమ్ముకోవద్దని మంచి వారికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో బి.అనిల్ కుమార్, జై భీమ్ రావు భారత్ పార్టీ ఎలక్షన్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దలకు వాక్సినేషన్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు

విశాలాంధ్ర-తాడేపల్లి : సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్థాపన పెద్దలకు వాక్సినేషన్ అవసరం గురించి తెలపటమే పరివర్తనాత్మకమైన ఆరోగ్య సంరక్షణ వెల్‌నెస్‌పై మా నిబద్ధత తెలియజేస్తుందని డాక్టర్ సుధాకర్ కంటేపూడి అన్నారు. బుధవారం తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. డాక్టర్ సుధాకర్ కంటేపూడి మాట్లాడుతూ పెద్దలకు వాక్సినేషన్‌ను సులువుగా అందించ దానికి ఒక కేంద్రాన్ని నిర్మించడం లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. వాక్సినేషన్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను స్థాపించిందని తెలిపారు. న్యుమోకాకల్ వ్యాధి, ఇన్ఫ్లుఎంజా వంటి పెరుగుతున్న శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల కారణంగా వాక్సినేషన్ పెరిగిన అవసరాన్ని గుర్తిస్తూ, ఈ సీఓఈ (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) వృద్ధులకు, కొమొర్బిడిటీ ఉన్న రోగులకు టీకాలు వేయడం ద్వారా నివారణ ఆరోగ్యానికి క్రమబద్ధమైన విధా నాన్ని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. హాస్పటల్లో సమగ్ర ఆరోగ్య సంరక్షణ పర్యా వరణ వ్యవస్థను ఏర్పాటు చేయడం రోగులకు టీకాలు వేయడం కోసం చురుకైనా నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ లోకేష్, డాక్టర్ మనోజ్‌కుమార్, డాక్టర్ ఏవీఎస్ఎస్ఎన్ శ్రీధర్, డాక్టర్ యు.హారిక పాల్గొన్నారు.

పిల్లలలో పేను చికిత్సపై అవగాహన

- ఏపీ, తెలంగాణలో 300 పైగా పాఠశాలల్లో 3.5 లక్షల మందికి చేరువ

విశాలాంధ్ర - గుంటూరు : పిల్లలలో పేనులను తొలగించడానికి సమర్ధవంతమైన పద్ధతులపై విశ్వసనీయమైన పేను చికిత్స బ్రాండ్‌గా గుర్తింపు పొందిన 'మెడికర్' అవగాహన సమావేశం నిర్వహించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. హెయిర్ హైజీన్ మిషన్‌తో చర్చను నిర్వహించడంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. ఐఎంఆర్బీ నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. ప్రతి సంవత్సరం ప్రతి ముగ్గురిలో ఒకరు లేదా 37 శాతం కంటే ఎక్కువ కుటుంబాలను పేనులు ప్రభావితం చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం చాలా ఇళ్లలో పేను దువ్వెనలు ఉపయోగిస్తున్నారన్నారు. మారికో లిమిటెడ్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ సోమశ్రీ బోస్ అవస్తి మాట్లాడుతూ ఒక బ్రాండ్‌గా, వినియోగదారులకు సమర్థవంతమైన పరిష్కారాలను అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. కొబ్బరి, వేప వంద శాతం సహజ యాక్టివ్‌లతో పిల్లల కోసం తీర్చిదిద్దిన సురక్షితమైన షాంపూతో కేవలం నాలుగు వారాలలో పేను తొలగింపును సౌకర్య వంతంగా మార్చిందన్నారు. హెయిర్ హైజీన్ మిషన్ ద్వారా మెడికర్ 300 పాఠశాలలలో 3.5 లక్షల మందికి పైగా పిల్లలకు పేను సమస్యను ఎదుర్కోవడంలో అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులలో ప్రోత్సాహ కరమైన ప్రతిస్పందనను బ్రాండ్ చూసిందన్నారు. పాఠశాల పిల్లల సృజనాత్మకతను వెలికితీసేలా డ్రాయింగ్ పోటీని కూడా నిర్వహించిందనన్నారు. 1968లో ప్రారంభించబడిన మెడికర్ దేశం విశ్వసించే బ్రాండ్‌గా మారిందనీ వివారించారు. ఇది 'పిల్లలకు సేఫ్' అని వైద్యపరంగా పరీక్షించబడిందనీ. వాష్-ఆఫ్ షాంపూ ఫార్మాట్ (సాచెట్‌లు & బాటిల్) లో అందుబాటులో ఉంటుందన్నారు.

పెన్షన్ అంశాన్ని రాజకీయం చేయడం సరికాదు

విశాలాంధ్ర-గుంటూరు : వైసీపీ ప్రభుత్వం పెన్షన్ పంపిణీ అంశాన్ని కూడా రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తుందని ప్రత్తిపాడు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బూర్ల రామాంజనేయులు అన్నారు. టీడీపీ వల్లే పెన్షన్ పంపిణీ ఆలస్యమౌతుందని, పెన్షన్‌దారులు అసౌకర్యానికి గురౌతున్నారని టీడీపీపై బురద చల్లడానికి ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీపై అసత్య ఆరోపణలు, ప్రచారాలు చేసి లబ్ది పొందాలని చూడటం సిగ్గుచేటని అన్నారు. వైసీపీ నాయకులు ఎన్నికల కమీషన్ నిబంధనలు తుంగలో తొక్కి వలంటీర్ల మెడమీద కత్తి పెట్టి వారితో ఎన్నికల కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో కొర్రపాటి నాగేశ్వరరావు, గింజుపల్లి వెంకటెశ్వరరావు, పొన్నగంటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులో మంత్రి రజిని ఆత్మీయ పలకరింపు

విశాలాంధ్ర-గుంటూరు : అమ్మా బాగున్నావా..? అన్నా .. బాగున్నావా.. అంటూ మంత్రి విడదల రజిని ఆప్యాయంగా పలుకరించుకుంటూ బుధవారం ఆకస్మాత్తుగా బృందావన్‌గార్డెన్స్ సెంటర్‌లోని రైతు బజారులో ప్రత్యక్షమయ్యారు. ఉదయాన్నే రైతు బజారుకు చేరుకున్న మంత్రి అక్కడి వ్యాపారు లను ఒక్కొక్కరిగా పలుకరించుకుంటూ వెళ్లారు. అందరి పేర్లు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయో వారినే నేరుగా అడిగి తెలుసుకున్నారు. రైతు బజారులో కూరగాయలు కొనడానికి వచ్చిన పలువురు వినియోగదారులను కూడా మంత్రి పలకరించారు. ఈ సందర్భంగా రైతు బజారులోని పలు సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రజిని హామీ ఇచ్చారు.

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా మరియు పట్టణం, రాజేంద్ర నగర్, 1వ లైను, గొల్టిపాటి కళ్యాణమండపం ఎదురు, డోర్. నెం: 3-1-163 వాస్తవ్యులు **కంభంపాటి నాగేశ్వరరావు మరియు వారి ధర్మపత్ని సుబ్బాయమ్మ మరియు వారి కుమారులు రవి చంద్ర, జవహర్ బాబు మరియు వారి కుమార్తె బిందుల** అనుమతి పొంది యావన్మందికి తెలియజేయు బహిరంగ ప్రకటన:

ది: **26-12-2023**న అథరైజ్డ్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్సెట్ రికవరీ బ్రాంచ్ వారు సాక్షి డైలీ న్యూస్ పేపర్ నందు వారికి రావలసిన బ్యాంక్ బకాయిల విషయమై బహిరంగ ప్రకటన ఇచ్చియున్నారు. సదరు ప్రకటనలో మా క్లయింట్ **కంభంపాటి సుబ్బాయమ్మ గారు** మరణించినట్లుగా ఉదహరిస్తూ వారి కుమారులు మరియు కుమార్తెను లీగల్ హెయిర్స్‌గా ప్రకటించి యున్నారు. అంతే కాకుండా లేని జిన్నింగ్ మిషనరీని ఉన్నట్లుగా చూపిస్తూ బహిరంగ వేలంనకు ఉన్నట్లుగా తెలియజేసియున్నారు. మా క్లయింటు **కంభంపాటి సుబ్బాయమ్మ గారు** సంపూర్ణ ఆరోగ్యంతో ఉండియున్నారు. యూనియన్ బ్యాంక్ వారు ప్రకటించిన బహిరంగ ప్రకటన వల్ల మా క్లయింట్లు చాలా అవమానములకు గురియై ఉన్నారు. ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా యూనియన్ బ్యాంక్ వారు ప్రకటించినవి అవాస్తవములు. కావున ప్రజలు ఎవరూ నమ్మరాదని, యూనియన్ బ్యాంక్ వారు ప్రకటించిన అవాస్తవములపై చట్టపరమైన చర్యలు మరియు న్యాయబద్ధమైన చర్యలు తీసుకుంటామని ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయుటమైనది.

CHAANUKYA'S
FIGHT FOR RIGHT
SRINIVASA RAO, GCH.
M.A.,M.A.,M.Sc., L.L.M
B.V SESHU KUMAR;
Sri Rama Krishna. T; Smt. VENKATA RAMANA.N; Bharath Chandra. G
Advocates Block.No.5;
Om Sri Sathya sai Sadan; Main Road; Pattabhipuram; Guntur - 522006.
Cell:9849658005,9390511561

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ప్రిసైడింగ్ అధికారులకు విధులపై అవగాహన కలిగేలా శిక్షణ అందించాలి

- కలెక్టర్ వేణుగోపాల రెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగేలా శిక్షణ అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, సెక్టోరల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో కలెక్టర్, రిటర్నింగ్ అధికారులైన సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి, కమిషనర్ కీర్తీ చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్‌తో కలిసి ప్రిసైడింగ్ (పీఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ (ఏపీఓ)లకు శిక్షణ ఇచ్చే అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, సెక్టోరల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల్లోని పీఓ, ఏపీఓ, ఇతర సిబ్బంది దాదాపు 13000 మంది ఉద్యోగులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై పూర్తి అవగాహనతో బాధ్యతగా విధులు నిర్వహిస్తేనే ఎన్నికల సంఘం లక్ష్యం అయిన జీరో రీ పోల్ సాధ్యం అవుతుందన్నారు. సంయుక్త కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో, పోలింగ్ కేంద్రాలలో, రిస్పషన్ సెంటర్లలో పీఓలు, ఏపీఓలు నిర్వర్తించాల్సిన విధులను సమగ్రంగా వివరించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, అదనపు కమిషనర్ రాజ్య లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక ప్రకారం అభివృద్ధి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రణాళిక ప్రకారం అభివృద్ధి చేసుకెళ్లడం అనేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఆమె బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం, అన్నమయ్య పార్కులను సందర్శించారు. ఎన్టీఆర్ స్టేడియ లో కొద్దిసేపు షటిల్ ఆడి అక్కడివారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ గుంటూరును రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబట్టేలా ప్రణాళిక ప్రకారం పనిచేసుకెళుతున్నామని చెప్పారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా మారుమూల రోడ్లను కూడా నిర్మించామని చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా నగరాన్ని తీర్చిదిద్దడం తన లక్ష్యమన్నారు. గార్డెన్స్ సెంటర్‌లోని ఎన్టీఆర్ స్టేడియంకు వచ్చిన వాకర్స్‌ను, క్రీడాకారులను పలుకరించారు. షటిల్ కోర్టులో కొద్దిసేపు అక్కడి క్రీడాకారులతో షటిల్ ఆడారు. స్టేడియంకు సంబంధించి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, 33వ డివిజన్ కార్పొరేటర్ గోపి శ్రీనివాస్, 35వ డివిజన్ ఇన్‌ఛార్జి టీఎల్‌వీ ఆంజనేయులు, 38వ డివిజన్ ఇన్‌ఛార్జి బొగిసం ప్రసాద్, సచివాలయ కన్వీనర్లు వెంకాయమ్మ, మరియమ్మ, వైసీపీ నాయకులు హేమంత్ నాయుడు, కామినేని విజయ్, గంటి, పరసా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయాన్ని వృధా చేసేందుకే పాత కేసులలో 41ఏ నోటీసులు : సాయికృష్ణ

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: రాజకీయ వేధింపులతో పెట్టిన అక్రమ కేసులలో ఎన్నికల కీలక సమయంలో విలువైన సమయాన్ని వృధా చేసేందుకే నాలుగేళ్ల నాటి పాత కేసులలో 41ఏ నోటీసుల డ్రామా అని, సార్వత్రిక ఎన్నికల కార్యక్రమాలలో తిరుగుతుండగా ఎప్పుడో 4 ఏళ్ల నాటి కేసులో 41ఏ నోటీసులు తీసుకోవాలంటూ 2020లో కోవిడ్-19 నిబంధనలు ఉల్లంగిస్తూ అమరావతి రాజధానికి మద్దతుగా ర్యాలీ చేశామని పెట్టిన కేసులో పిలిచినప్పుడు విచారణకు హాజరు కావాలంటూ అరండల్‌పేట పోలీసులు నోటీసులు జారీ చేయడంపై గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేసారు. న్యాయవాది కాళిదాసు సమక్షంలో సాక్షులుగా తెలుగుదేశం నాయకులు కసుకుర్తి హనుమంత రావు, శొంఠినేని అనిల్‌లు సంతకాలు చేసారు.

ముగిసిన అండర్-20 ఇంటర్ జోనల్ యూత్ ఫుట్బాల్ లీగ్ పోటీలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: మార్చి 30 నుండి ఏప్రిల్ 3 వరకు గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫుట్బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-20 మెన్స్ ఇంటర్ జోనల్ యూత్ లీగ్ పోటీలు నిర్వహించడం జరిగింది. రాష్ట్రంలో ఉన్న 26 జిల్లాలన్నీ 8 జోన్‌లుగా విభజించి వారి మధ్య ఈ పోటీలు నిర్వహించడం జరిగింది. మొత్తం 8 జోనల్ నుంచి 150 మంది ఫుట్బాల్ క్రీడాకారులు పోటీలలో పాలొనడం జరిగింది. కోరమండల్ జోన్ విజేతగా నిలిచింది. ఈ 8 జోనల్ నుంచి ప్రతిభగల క్రీడాకారులకు ఎంపిక చేయడం జరిగింది. ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేసి వారికి క్యాంపు నిర్వహించి మే నెలలో జరిగే అండర్ 20 నేషనల్ ఫుట్బాల్ ఛాంపియన్ షిప్‌కి పంపించడం జరుగుతుందని ఫుట్బాల్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ, గుంటూరు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్ బుధవారం తెలియజేశారు. గుంటూరు జిల్లా సెక్రెటరీ దుర్గా మోహన్ చేతుల మీదుగా అతిథులకు బహుమతులు ఇవ్వడం జరిగింది.

నీతివంతమైన రాజకీయాలకు చోటు లేకపోవడం విచారకరం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నీతివంతమైన రాజకీయాలకు నేడు ఏమాత్రం చోటు లేకపోవటం విచారకరమని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు టి.నారపరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'నేర, ధన రాజకీయాలను పెంచి పోషిస్తున్న ప్రధాన పార్టీలు' అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. నారపరెడ్డి మాట్లాడుతూ నేడు రాజకీయాలలో డబ్బున్నవారే రాణిస్తున్నారని, సామాన్యులు రాజకీయాలలో రాణించే అవకాశాలు కనుచూపు మేరల్లో కూడా కనపడటం లేదన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్న భారతదేశంలో నేడు ప్రజాస్వామ్యం నేరచరితుల, ధన రాజకీయాల చేతుల్లో బందీగా కూనారిల్లుతుందని దుయ్యబట్టారు.న్యాయవాది అవధానుల హరి మాట్లాడుతూ చెమట చుక్కలు బందించకుండా ప్రజల సొమ్మును దోచుకుని రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా ఎదిగే అవకాశాలు భారత రాజకీయాలు కల్పించటం విచారకరమని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంజనీర్ పి.ఘన శ్యామాచార్యులు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్లు నిద్రావస్థ నుంచి మేల్కొని నేర, ధన రాజకీయాలను పూర్తిగా నిలవరించే దిశగా ప్రక్షాళన గావించి ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కొండా శివరామిరెడ్డి, ఎల్.మురళీకృష్ణ, చంద్రయ్య పాల్గొన్నారు.

ఈ నెల 6న 'అభివృద్ధి, సంక్షేమం'పై చర్చా గోష్టి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తారీఖున ఉదయం 11.30 గంటలకు విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో 'అభివృద్ధితో సంక్షేమం-సుపరిపాలనకు సవాళ్లు' అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహిస్తున్నట్లు సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి బుధవారం తెలిపారు. ప్రముఖ ఆర్థికవేత్త ఎకనామిక్ అండ్ పొలిటి కల్ వీక్లీ సంపాదకులు ప్రొఫెసర్ ఎస్. మహేంద్రదేవ్ 'అభివృద్ధితో సంక్షేమం' అనే అంశంపై ప్రధాన ఉపన్యాసం చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ చీఫ్ సెక్రెటరీ, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఉపాధ్యక్షులు ఎల్వీ సుబ్రమణ్యం, మాజీ ఎన్నికల అధికారి, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్‌లు పాల్గొని మాట్లాడతారని తెలిపారు. విద్యావేత్తలు, ప్రజాస్వామ్యవాదులు అధిక సంఖ్యలో పాల్గొని చర్చా గోష్టిని జయప్రదం చేయాలన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ఎన్నికల సిబ్బందికి విధుల కేటాయింపుపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర-నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికలలో పాల్గొంటున్న పోలింగ్ సిబ్బంది తొలి విడత రాండమైజేషన్ ప్రక్రియను చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎన్నికల పోలింగ్ సిబ్బంది నియామకాలపై నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారికి పీవోలుగా నియమించేలా చూడాలన్నారు. ఎటువంటి అవకతవకలు జరగకుండా జాబితాని సిద్ధం చేయాలని సూచించారు. పదవి విరమణ పొందిన వారు, చనిపోయిన వారి వివరాలను తొలగించి పగడ్బందీగా జాబితానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ కోసం వెళ్లి మృతి చెందడం అవాస్తవం : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: సామాజిక పెన్షన్లు పంపిణీలో భాగంగా దుర్గి మండలం నెహ్రూనగర్ తండాకు చెందిన రామావత్ సాలి భాయ్(70) బుధవారం పింఛన్ కోసం ముటుకూరు-2 సచివాలయం వెళుతూ మార్గ మధ్యలో చనిపోవడం జరిగిందని సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతున్న విషయం పూర్తిగా అవాస్తవమని జిల్లా కలెక్టర్ శివశంకర్ ప్రకటించారు. స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించిన పిదప సాలిబాయి సహజ మరణం పొందినట్లు, ఆమె గత రెండు రోజులుగా అనా రోగ్యంతో గ్రామంలోనే ఉన్నదని ధ్రువీకరించారని పేర్కొన్నారు. పింఛన్ కోసం గ్రామం వీడి రాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వయోవృద్ధులకు దివ్యాంగులకు అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వారి ఇంటి వద్దనే పింఛను అంద జేసే విధంగా ఆదేశాలు జారీ చేశామన్నారు.వయోవృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.

నెహ్రూనగర్‌లో ఎమ్మెల్యే పీఆర్కే ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-మాచర్ల : సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సోదరుడు వెంకటరామిరెడ్డి బుధవారం పట్టణంలోని 3, 4వ వార్డులలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేయవలసిన అవసరం ఉందన్నారు. సీఎం జగన్ ఆశీస్సులు, నియోజకవర్గ ప్రజలు తనపై చూపిన ఆదరణతో ఇప్పటికి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. ఈసారి కూడా తన గెలుపుకు కృషి చేయాలని ఆయన వార్డు వాసులను కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గ కేంద్రమైన మాచర్లతోపాటు, ఆయా మండలాల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి తాను, తన సోదరుడు వెంకటరామిరెడ్డి కట్టుబడి ఉన్నామని, జరగబోవు ఎన్నికల్లో తన విజయానికి వార్డు ప్రజలంతా సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసశర్మ, చిన్న ఏసోబు, తురకా కిషోర్, బోయరఘురామిరెడ్డి, పోలా శ్రీనివాసరావు, కుర్రిసాయి మార్కొండారెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

విశాలాంధ్ర-శావల్యాపురం: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశామని, శాంతి భద్రతలకు ఏమాత్రం విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ రావు హెచ్చరించారు. మండలంలోని చిన్నకంచర్ల, పిచికలపాలెం గ్రామాలలో కేంద్ర బలగాలతో బుధవారం కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వివాదాలకు దూరంగా ఉండాలని, లేనిపోని గొడవల్లో తలదూర్చి కేసులతో జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. ఎస్ఐ చల్లా సురేష్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ముస్లింలు ఎవరూ, మోసకారి జగన్ వలలో చిక్కుకోవద్దు: టీడీపీ నేతలు

ముస్లిం మైనార్టీ, నూర్‌బాషాల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న షరీఫ్, జీవీ, లావు

విశాలాంధ్ర - వినుకొండ : ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తోన్న మోసకారి ముఖ్యమంత్రి జగన్ వలలో ముస్లింలు చిక్కుకోవద్దని శాసన మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్, తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు విజ్ఞప్తి చేశారు. విభజించి పాలించాలని చూస్తోన్న వైకాపా కుయుక్తులపై అప్రమత్తత, సంయమనంతో ఉండాలని వారంతా కోరారు. వినుకొండ వై కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ముస్లిం మైనార్టీ, నూర్ బాషాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో వారు మాట్లాడుతూ శాసనమండలి మాజీ ఛైర్మ్ షరీఫ్ ఎన్ఆర్సీ, సీఏఏ, ట్రిపుల్ తలాక్, కశ్మీర్‌కు సంబంధించిన 370 ఆర్టికల్‌పై లోక్‌సభ, రాజ్యసభలో బలపరిచింది వైసీపీ కాదా అని ప్రశ్నించారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ఆయన్ను ఒప్పించి కలాంను రాష్ట్రపతిగా చేసింది చంద్రబాబుకి జగన్‌కు మధ్య ఇక్కడే తేడా గమనించవచ్చన్నారు షరీఫ్. బీజేపీతో ఉన్నప్పుడే హైదరాబాద్‌లో హజ్ హౌస్ నిర్మించామని గుర్తు చేశారు. కడప, విజయవాడలో హజ్ హౌస్‌లు నిర్మించడానికి రూ.70 కోట్లతో శంకుస్థాపన చేస్తే ఆ డబ్బులు దారి మళ్లించి వాడుకున్నారని మండిపడ్డారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వంలో మోదీ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా ఇమామ్‌లకు గౌరవం వేతనాలు, దుల్హన్ పథకం, మసీదుల నిర్మాణానికీ నిధులు అందించామన్నారు. ముస్లింల 4% రిజర్వేషన్ల కోసం సుప్రీంకోర్టులో గట్టి వాదనలు వినిపించేదే ఇద్దరు ప్రముఖ లాయర్లను చంద్ర బాబు నియమిం చారన్నారు. జగన్ ఈ ఐదేళ్లలో ఆ ప్రయత్నాల్ని కూడా నీరుగార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుదేశం ఎప్పటికీ లౌకిక పార్టీనే అన్న షరీఫ్ ముస్లింల ధార్మిక, ఇస్లామిక్ విషయాల్లో ఎవరైనా జోక్యం చేసుకుంటే వ్యతిరేకించి తీరుతామన్నారు. ముస్లిం సంక్షేమం కోసం రూ.1500 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల వరకు కేటాయిస్తామన్నారు. తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ ప్రాంతానికి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఈ ఐదేళ్లలో రూ.300 కోట్ల నిధులు తీసుకొస్తే తాను ఐదేళ్లలో రూ.2,600 కోట్లు తీసుకొచ్చానని చెప్పారు. ముస్లిం షాదీ ఖానాలకు నిధులు అందించామన్నారు. మర్కజ్ మసీదు నిర్మిస్తుంటే చంద్రబాబుతో మాట్లాడి రూ.28 లక్షలు తీసుకొచ్చినట్లు తెలిపారు. తాను వ్యక్తిగతంగా రూ.11 లక్షల విరాళం, అవసరం అయిన సిమెంట్ కూడా ఇచ్చానన్నారు. ఈద్గా, మదర్సా కోసం కూడా ఆర్థికం సాయం చేసినట్లు వివరించారు.ఎంపీగా వచ్చే అయిదేళ్లలో నర్సరావుపేట పార్లమెంటరీ నియోజ వర్గంలో కనీసం 50 షాదీఖానాలకు ఎంపీ లాడ్స్ నిధులు అందించేలా కృషి చేస్తామన్నారు. ఖురాన్ సహా ఏ పవిత్రగ్రంథమైె నా చెప్పేది ఒక్కటే. మంచి మనస్సు, మంచివ్యక్తి, నిజాయతీ పరులను ఆశీర్వదించండని సూచించారు. ఈ కార్యక్రమంలో షరీఫ్, జీవీ, లావుతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నేత నాగశ్రీను, నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబహాన్, హాజరయ్యారు.

మూడో తేది వచ్చినా అందని పెన్షన్లు

- సచివాలయాల వద్ద వృద్ధుల పడిగాపులు
- కానరాని ఏర్పాట్లు

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఎంకి పెళ్లీ సుబ్బి చావుకు వచ్చింది అన్న చందనా తయారైంది ఈ సార్వత్రిక ఎన్నికలు, ప్రతి నెలా ఒకటో తేదీ కెల్లా ఇంటి వద్ద సామాజిక భద్రతా పింఛన్లు పొందుతున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఇలా ప్రతిఒక్కరికి మూడో తేదీ వచ్చినా పింఛన్లు అందలేదు. మరో వైపు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ చేయవద్దని ఉత్తర్వులు వచ్చాయి. దీంతో అసలు రగడ ప్రారంభమైంది. పింఛన్లు పంపిణీ ఆగిపోవటానికి, జాప్యం జరగటానికి ప్రతిపక్షాలు కారణమని అధికార పార్టీ వైసీపీ ఆరోపిస్తుండగా, కాదు మీ నిర్వాకం వల్లే నిలిచిపోయాయని ప్రతిపక్షాలు దుమ్మెత్తి పోసుకున్నాయి. వలంటీర్ల ద్వారా పంపిణీ జరగదని, సచివాలయాల వద్ద బుధవారం నుంచి పింఛన్ అందజేస్తారని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, ఎండా నుంచి ఇబ్బందులు లేకుండా షామియానాలు ఏర్పాటు చేస్తామని, తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు అర్భాటంగా ప్రకటించారు. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో అటువంటి ఏర్పాట్లు లేకపోగా, పింఛన్లు కూడా సాయంత్రం వరకు పంపిణీ చేయలేదు. దీంతో అవ్వాతాతలకు ఆందోళన మొదలైంది.

నిధుల కొరతే కారణమా..?

పింఛన్ల పంపిణీ జరగకపోవటానికి నిధులు జమకాలేదని తెలుస్తుంది. ప్రభుత్వం పింఛన్లకు కేటాయించిన నిధులను వేరే అవసరాలకు బదలాయించిందని, ఇందువల్లనే పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పల్నాడు జిల్లా పరిస్థితిని ఒకసారి గమనిస్తే జిల్లాలో 28 మండలాలు, ఆరు పట్టణాలు, రెండు నగర పంచాయతీల పరిధిలోని 538 సచివాలయాల ద్వారా ప్రతి నెలా సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెలా 28, 29 తేదీల్లో అర్హుల జాబితా సెర్ప్ ద్వారా జిల్లా కేంద్రానికి, అక్కడి నుంచి సచివాలయాలకు చేరుతాయి. జిల్లావ్యాప్తంగా 2,82,100 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరికి రూ.84.27 కోట్ల నగదు పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు బ్యాంకుల నుంచి పైసా రాలేదు. 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని సెర్ప్ నుంచి అందిన ఆదేశాల మేరకు చెక్ బుక్‌లు పట్టుకుని బ్యాంకులకు పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ ఉద్యోగులు వెళ్లి ఖాళీ చేతులతో వెనక్కి వచ్చారు. ఇదే పరిస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్నట్లు తెలిసింది.

వృద్ధుల అవస్థలు : ఇంటివద్ద ఫించన్ పంపిణీ చేయటం లేదని తెలిసి, మండుటెండలో వృద్ధులుపింఛన్ల కోసం సచివాలయాలకు చేరుకున్నారు. వీరికి సమాధానం చెప్పే నాధుడు కరువయ్యారు. పింఛన్లు డబ్బులు రాలేదని, మళ్లీ రావాలని కొంతమంది సిబ్బంది తెలపటంతో తిరిగి వచ్చినా ఇదే సమాధానం రావడంతో వృద్ధులు ఇక్కట్లు పడ్డారు. ఏర్పాటు చేశామని అధికారులు అర్భాటంగా ప్రకటించినా ఎక్కడా అమలు అయిన దాఖలాలు లేవు.

పింఛన్ లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు..
సీహెచ్ గోవిందరావు, మున్సిపల్ కమిషనర్

చిలకలూరిపేట పట్టణ పరిధిలోని పెన్షన్ లబ్ధిదారులు అపోహలు నమ్మి ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు తెలిపారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు అన్నిరకాల ప్రభుత్వ పెన్షన్‌లు లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి సచివాలయల ఉద్యోగులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. పెన్షన్ కోసం ఎవరు ఎక్కడికి తిరగవలసిన అవసరం లేదని మూడు రోజుల్లో లబ్ధి దారులందరికీ పెన్షన్‌లు పంపిణీ చేయటం జరుగుతుందని స్పష్టంచేశారు.

టికెట్ ఎవరికి ఇచ్చినా కలిసి పనిచేయాలి

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా (టికెట్) పార్టీ అధిష్టానం ఎవరిని నిర్ణయించిన అందరూ కలిసి పనిచేయా లని పల్నాడు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అలెగ్జాండర్ కోరారు. బుధవారం స్థానిక వీఎల్ఎస్ లాడ్జిలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కంచర్ల పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరగా అలెగ్జాండర్ పార్టీ కండువాలు వేసి సాధరంగా ఆహ్వా నించారు. బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ అన్యాయం అక్రమపాలన సాగించి ప్రజాస్వామ్యానికి, తూట్లు పొడిచారన్నారు. దేశంలో మురళికార్గే, రాహుల్ గాంధీ, రాష్ట్రంలో వైయస్ షర్మిల నాయకత్వంలో బీజేపీ శక్తులకు వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి దేశంలో రాహుల్ గాంధీని ప్రధా నిగా చేసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. వినకొండ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ అధిష్టానం ఎవరికి నిర్ణయిస్తే వారిని గెలిపించేందుకు ఎటువంటి భేదభిప్రా యాలు లేకుండా అందరూ ఐక్యంగా కలిసి పనిచేయాలనికోరారు. సమావేశంలో కంచర్ల పూర్ణచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపాటి రామాంజనేయులు ఉన్నారు.

కుట్రలు మాని ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ చేయాలి: జీవీ

విశాలాంధ్ర - వినుకొండ : వైకాపా రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం అమలు చేస్తోన్న కుట్రలు మాని పింఛన్లు ఇంటికే పంపిణీ చేయాలని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌తో ఫోన్‌లో మాట్లాడిన జీవీ ఆంజనేయులు వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందిపడకుండా వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వాలని కోరారు. కావాల్సినంతమంది సచివాలయ సిబ్బంది ఉండి, ఇంటిటికీ వెళ్లి పంపిణీ చేసే అవకాశమున్నా జగన్‌రెడ్డి ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా వృద్ధులు, దివ్యాంగుల్ని ఇబ్బంది పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వినుకొండలో జరిగిన ముస్లిం మైనార్టీ, నూర్‌బాషాల ఆత్మీయ సమావేశం వేదిక నుంచే కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు జీవీ. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీకి తక్షణమే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. క్షేత్రస్థాయిలో 3,4 గ్రామాలకు కలిపి ఒకచోటే సచివాలయం ఏర్పాటు చేశారని, అలాంటి ప్రాంతాల్లో పింఛన్లు తీసుకోవడానికి లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జీవీ ఆంజనేయులు కోరిక మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. గ్రామాల వారీగా పింఛన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపడతామని ఆంజనేయులుకు తెలిపారు.

6న సత్తెనపల్లిలో చంద్రబాబు ప్రజాగళం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సత్తెనపల్లిలో ఈ నెల 6వ తేదీన జరగబోయే ప్రజాగళం రోడ్డుషోను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ నాయకులకు పిలుపు నిచ్చారు. బుధవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో కన్నా మాట్లడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజాగళం కార్యక్రమం, పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా ఈ నెల 6వ తేదీన సత్తెనపల్లి పట్టణంలో రోడ్డుషో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజాగళంకు సంబంధించి రూట్ మాప్ విధివిధానాలు, నాయకులకు దిశా నిర్దేశం చేసి, గ్రామాలలో నాయకు లకు, కార్యకర్తలు, అభిమానులు, యువతకు తెలియజేసి పెద్దఎత్తున పాల్గొనేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ నాయకులు, జనసేననాయకులు, బీజేపీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్లు కంటే కూటమి నేతలకు భయమెందుకు

విశాలాంధ్ర-గురజాల : వలంటీర్ వ్యవస్థ అంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలకు భయమెందుకని గురజాల మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ బడేజాని అన్నారు. వృద్ధులకు, వికలాంగులకు, లబ్ధిదారులైన ఇతర పెన్షన్‌దారులకు గత నాలుగున్నర సంవత్సరాలుగా ప్రతి నెల 1వ తేదీ ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి పెన్షన్లు అందజేస్తున్నారని, ఎన్నికల దగ్గర పడుతున్న తరుణంలో ఎక్కడ ఓడిపోతామో అనే భయంతో వలంటీర్ వ్యవస్థను పెన్షన్ల పంపిణీకి దూరం పెట్టి వృద్ధులను వికలాంగులను తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలు తీవ్ర అవస్థలకు గురి చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ బడేజాని మండిపడ్డారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధులు వికలాంగులు ఇతర పెన్షన్ లబ్ధిదారులు నేడు పెన్షన్ల కోసం నిరీక్షిస్తున్నారని, చంద్రబాబు నాయుడు రాజకీయ కక్ష వలన నేడు అవ్వా తాతలు, వికలాంగులు మండుటెండలో సచివాలయాలు వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. ఈ దుస్థితికి కారణం అయిన చంద్రబాబు నాయుడు పెన్షన్ లబ్ధిదారులకు సమాధానం చెప్పాలి అని బడేజాని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు(కెవి), మండల అధ్యక్షుడు గాంధీ, పట్టణ అధ్యక్షుడు కుక్కమూడి అన్నారావు, ఎంపీపీ కొమ్మినేని బుజ్జి, వివిధ వార్డుల కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

విశాలాంధ్ర-దుర్గి : మండల కేంద్రమైన దుర్గిలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బాబు ఘూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా 169 బూత్ పరిధిలోని వీధుల్లో పర్యటిం చారు. ఇంటింటికీ వెళ్ళి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమలయ్యే సూపర్-6 పథకాల కరపత్రాలను అందించి వివరించారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంపీగా లావు శ్రీకృష్ణదేవ రాయులుకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఓటర్లనునాయకులు కోరారు. కార్యక్రమంలో మేకల రామారావు,వెలిదండి శ్రీనివాసరావు, కటకం భవన్నారాయణ, బోల్లేదుల శాంతి, సూరె క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి



విశాలాంధ్ర-శావల్యాపురం: రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ నక్క లక్ష్మీ లావణ్య అన్నారు. మండల కేంద్రమైన శావల్యాపురం గ్రామంలో ఓటు హక్కు పై ప్రజలకు అవగాహన కల్పించే స్వీప్ కార్యక్రమాన్ని విద్యార్థులతో కలసి బుధవారం నిర్వహించారు. ప్రజలు ఎన్నికలలో ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చల్ల సురేష్, డిటి వేముల వెంకట నాగరాజు, ఆర్ఐ పేరుసోముల నారసయ్య, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో రాజకీయ లబ్ధి వద్దు

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : పెన్షన్ల పంపిణీని వివాదాస్పదంగా మార్చి రానున్న ఎన్నికలలో ఎవరికి వారు రాజకీయంగా లబ్ధి పొందటానికి ప్రయత్నిస్తున్నారని ప్రజా సంఘ నాయకులు ఆరోపించారు. బుధవారం పిల్లుట్ల రోడ్‌లో నిర్వహించిన మీడియా సమావే శంలో వారు మాట్లాడుతూ దివ్యాంగులు, అనారోగ్య సమస్యలతో ఉన్నవారిని, వృద్ధులను టీడీపీ, వైసీపీలు కావాలని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పీడీఎఫ్, ఎంసీపీఐ, సీపీఐ, ఆర్టీఐ తదితర ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారిని గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పెన్షన్ తీసుకోవాల నటం లాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు సరైనవి కావని, పెన్షన్ పంపిణీపై రాజకీయాలు చేయడం వల్ల దీనిపై ఆధారపడ్డ లక్షలాది మంది పెన్షన్ దారులు ఆర్థికంగా ఆరోగ్యపరంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేసారు. పెన్షన్ల పంపిణీ రాజకీయ కోణంలో చూడకుండా అధికార, ప్రతిపక్ష పార్టీలు వెంటనే పెన్షన్లు పారదర్శకంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు, ఎంసీపీఐ జిల్లా అధ్యక్షులు కృష్ణ, సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణానాయక్, ఆర్టీఐనాయకులు కుమార్ పాల్గొన్నారు.

ప్రజలు వ్యవస్థలో మార్పు కోరుకుంటున్నారు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : ప్రజలు వ్యవస్థలో మార్పు, విధానాల్లో మార్పు కోరుకుంటున్నారు. ఆ మార్పు కేవలం టీడీపీ-జేఎస్పీ-బీజేపీ కూటమి ద్వారానే సాధ్యమని ఉమ్మడి అభ్యర్థి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రయోజనాల కోసమే టీడీపీ-జేఎస్పీ-బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధులు, జరగాల్సిన అభివృద్ధి కోసమే రాష్ట్రంలో మూడు పార్టీలు జతకట్టాయని ప్రజల శ్రేయస్సును, వారి భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొనే కూటమి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో దళితులకు సరైన స్వేచ్ఛలేదు. ప్రభుత్వ అక్రమాలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారు, కేసులు పెడుతున్నారన్నారు. ఈ అరాచకాలపై దళితులంతా ఏకం కావాలని, మే 13న మీ ఓటును కూటమి అభ్యర్థులకు వేయాలని కోరారు. ఇప్పటికైనా జగన్ రెడ్డి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోకుంటే కుక్కలు చింపిన విస్తరిగా రాష్ట్రం మారుతుందన్నారు. రాష్ట్రం లోని ప్రతి కుటుంబాన్ని అభివృద్ధి చేసేందుకు 20 అంశాలతో కూడిన విజన్ డాక్యుమెంట్ రూపొందిస్తామని మా అధినేత ప్రజాగలం బహిరంగ సభలో మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమం కోసం ఎంతటి త్యాగానికైనా కూటమి సిద్ధమన్నారు. జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అధికారులు నిష్పక్షపాతంగా పనిచేయాలి

విశాలాంధ్ర-మాచర్ల: ప్రభుత్వ అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించినప్పుడే సమాజంలో మంచి విలువ, ప్రజాదరణ లభిస్తుందని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అన్నారు. గురువారం మల్లికార్జున రావు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతుండటం పరిపాటిగా జరుగుతుందని, కానీ ప్రలోభాలకు గురై అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన ఉన్నతాధికారులు ఎప్పటికైనా తలవంచగా తప్పదన్నారు. రాష్ట్రంలో ఏకపక్షంగా వ్యవహరించిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఈసీ కొరడా ఝులిపించిన వైనం సంచలనం రేపిందన్నారు. మనది ప్రజాస్వామ్య దేశం అని, రాజ్యాంగానికి లోబడి నడవాల్సి ఉందన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత పదవులకు విలువేముంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రపాలన వ్యవహారాలు అధికారులపై ఆధారపడి ఉందని, ఇప్పటికైనా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజల నమ్మకాన్ని కాపాడాలని ఆయన కోరారు.

ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తే భారీ మూల్యం తప్పదు : యరపతినేని

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను బెదిరించటం తప్పుడు కేసులు బనాయిస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రిక విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు ఎక్కడికక్కడ ఎన్నికల నిబంధనలో ఉల్లం ఘిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఏ స్థాయి అధికారులైనా తమ కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసిన వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఆయన హెచ్చరించారు. అటువంటి అధికారులకు పై ఎలక్షన్ కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని ప్రైవేట్ కేసులు కూడా వేస్తామని హెచ్చరించారు. అధికార పార్టీ ఆదేశాల కనుగుణంగా ప్రవర్తిస్తే ఎస్పీలు వెళ్ళి పోయినట్లే మీరు కూడా ఉద్యోగాలు పోగొట్టుకొని జైలుకు వెళ్ళవలసి వస్తుందన్నారు. వాలంటీర్లు ద్వారా కాకుండా మిగతా ఉద్యోగులతో ఇళ్లకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేయాలని ఎలక్షన్ కమిషన్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు కోరాయి అన్నారు. దీనిని వక్రీకరించి ఇష్టా రాజ్యంగా వీళ్ళ చెత్త పత్రికలో పూఖను పుంఖలుగా కథనాలు ప్రచురిస్తున్నారని ప్రజలు దీని అర్థం చేసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. సమావేశంలో జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అంబటి నమ్మించి మోసం చేశారు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : కట్టవారిపాలెం గ్రామ అభివృద్ధిపై గుడిలో ప్రమాణానికి మంత్రి అంబటి రాంబాబు సిద్ధమా అని ఇటీవల వైసీపీ పార్టీకి రాజీనామా చేసిన సీనియర్ నాయకులు మదమంచి రాంబాబు ప్రశ్నించారు. బుధవారం సత్తెనపల్లి పట్టణంలో విలేకరుల సమావేశంలో వైసీపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మదమంచి రాంబాబు మంత్రి అంబటిపై ఫైర్ అయ్యారు. మదమంచి మాట్లడుతూ నాపై మంత్రి అంబటి విమర్శలు చేయటం సరికాదన్నారు. నన్ను అధికారానికి పార్టీకి దూరం చేసింది మంత్రి అంబటేనన్నారు. సంక్రాంతి సంబరాలకు రూ.11 లక్షలు చందా ఇచ్చానన్నారు. అభివృద్ధి పనులకు లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయానని మందమంచి అవేదన వ్యక్తం చేశారు. మంత్రి నన్ను నమ్మకంగా మోసం చేశాడనీ ఆరోపించారు. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వంలో కట్టవారిపాలెం 90 శాతం అభివృద్ధి చెందిందని అన్నారు.

విశ్వబ్రాహ్మణులకు తగిన ప్రాధాన్యతనివ్వాలి

విశాలాంధ్ర-రాజుపాలెం : విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యతనివ్వాలని విశ్వబ్రాహ్మణ సంఘం సత్తెనపల్లి నియోజక వర్గం నాయకులు చింతాడ రమేష్ కోరారు. బుధవారం స్థానిక నవోదయ స్కూల్‌లో జరిగిన రాజుపాలెం మండలం విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశం జరిగింది. సమావేశానికి సంఘ బాధ్యులు కృష్ణమాచారి అధ్యక్షత వహించారు. రమేష్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ మండలంలో సుమారు వందకు పైగా విశ్వబ్రాహ్మణ కుటుంబాలు ఉన్నాయన్నారు. మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణులకు కమ్యూనిటీ హాల్ కేటాయించాలని కోరారు. మండలంలో కొన్ని గ్రామాలలో స్మశాన వాటికలు స్థలం కేటాయించాలని కోరారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. అధ్యక్షులుగా దుపగుంట కోటి వీరాంజనేయులు, కార్యదర్శి అల్లూరి శ్రీనివాస్, కోశాధికారి నారాయణపురం ఆంజనేయులు, ఉపాధ్యక్షులు సిద్ధి కృష్ణమాచారి, సహాయ కార్యదర్శి పాలడుగు హనుమం తరావు, సభ్యులుగా ఏలూరి వీరబ్రహ్మాచారి, అద్దంకి భూషయ్య, నారాయణపురం రామబ్రహ్మం అచారి, పానుగంటి శ్రీను, గౌరవసలహాదారు దూపగుంట కోటేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలలో సత్తెనపల్లి నియోజకవర్గ సంఘ నాయకులు చింతాడ రమేష్, పాల్గొన్నారు.

ఇంటి వద్దే పెన్షన్లు పంపిణీ చేయాలి

విశాలాంధ్ర - వినుకొండ : వృద్ధులు, వికలాంగులు, ఇతర పెన్షన్ లబ్ధిదారులకు ఇంటి వద్దే పెన్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలి. వాలంటీర్లకు బదులుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి కోరుతూ వినుకొండ మండలం ఎంపీడీఓని కలసి వినతిపత్రం పత్రం అందజేసిన మండలం టీడీపీ అధ్యక్షులు మాదినేని ఆంజనేయులు, టీడీపీ నాయకులు

ఉమ్మడి పార్టీల ప్రచార కార్యక్రమం

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక 9వ వార్డు ప్రచార కార్యక్రమంలో మంగళ వారం రాత్రిపాల్గొన్న వినుకొండ నియోజకవర్గం తెలుగుదేశం-జనసేన-బీజేపీ పార్టీల ఉమ్మడి అభివృద్ధి జీవి ఆంజనేయులు, వినుకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు, శివశక్తి లీలాంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి, వినుకొండ నియోజకవర్గం జనసేన సమన్వయకర్త కొంజేటి నాగ శ్రీను, బీజేపీ ఇన్‌ఛార్జ్ యార్లగడ్డ లెలిన్ కుమార్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

తాగునీటి చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-దుర్గి : వేసవి దృష్ట్యా వివిధ పనుల నిమిత్తం కార్యాల యాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు దోహద పడతాయని తహాశీల్దార్ జి.రజని కుమారి అన్నారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ఆవరణలో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత త్రాగునీటి చలి వేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాలు మేరకు రెవిన్యూ సేవల్లో ఏఫ్రిల్ నుంచి జూన్ వరకు చల్లటి మినరల్ వాటర్ ఈ చలివేంద్రంలో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీటీ ఫణీంద్ర కుమార్, వీఆర్వోలు జీరయ్య, వీఆర్ఏలు మస్తాన్ వలి, డేటా ఎంట్రీ ఆపరేటర్ అనిల్ శాస్త్రి ఉన్నారు.

ఇంటి వద్దకే వెళ్ళి పింఛన్ పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-నూజెండ్ల : పింఛన్లు సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేసే విధంగా చూడాలని మండల పార్టీ అధ్యక్షులు మీసాల మురళీకృష్ణ యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గల మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.వీరభద్రాచారికి మీసాల మురళీకృష్ణ యాదవ్ మెమోరాండంను అందజేశారు. సచివాలయ పరిధిలో గల హాబిటేషన్ గ్రామాలలో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందిపడకుండా వారి ఇళ్ల వద్దకే వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేసే విధంగా చూడాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో ముంద్రు సుబ్బారావు, వీర్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - వినుకొండ : స్థానిక 26 వార్డు నుండి అధికార వైసీపీ పార్టీని వీడి టీడీపీలోకి 30 కుటుంబాలు చేరారు. వీరందరినీ వినుకొండ నియోజకవర్గ టీడీపీ -జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిజీ.వీ ఆంజనేయులు, నరసరావు పేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెనమల్లికార్జునరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రాఘవేంద్ర

విశాలాంధ్ర-నరసరావుపేట: పల్నాడు జిల్లా ఎస్పీగా ప్రస్తుతం ఏఎస్‌పి (అడ్మిన్)గా నిర్వహిస్తున్న బి రాఘవేంద్ర బుధవారం ఉద్యోగ బాధ్యత స్వీకరించారు. ఇప్పటివరకు ఎస్పీగా పని చేసిన శివశంకర్ రెడ్డిని ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. తక్షణం ఎస్పీ రవిశంకర్ రెడ్డి తమ కింది అధికారికి ఉద్యోగ బాధ్యతలు అప్పజెప్పి రిలీవ్ కావాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. నూతన ఎస్పీ వచ్చేవరకు రాఘవేంద్ర జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహించనున్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర-రెంటచింతల: సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్ర ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అతి త్వరలో రాబోతుందని మాచర్ల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. ఇంటింటికీ జూలకంటి ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం అంతోని వారి కాలనీ, నాయుడుపేట, కొత్త కాపు గడ్డ ప్రాంతాలలో ఆమె ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంచుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, సీనియర్ నేత దండే శివయ్య, ఓరుగంటి ఇన్నారెడ్డి, తుమ్మా జోజి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వరసిద్ధ వినాయక స్వామికి విశేష పూజలు

విశాలాంధ్ర -వినుకొండ : వినుకొండ కొండమెట్ల వేంచేసియున్న శ్రీ వరసిద్ధ వినాయక స్వామి వారి దేవస్థానము నందు ప్రతినెల మొదటి బుధవారం స్వామివారికి విశేష పూజా కార్యక్రమంలో తో పాటు భక్తులందరికీ అన్నదాన వితరణ కార్యక్రమం జరుగుతుంది. ఇందులో భాగంగా బుధవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తు లకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంకు తమ సహాయ సహకారాలు అందజేస్తున్న అడ్డగిరి తారక్, భక్తజన బృం దం, భక్తజన బృందం తరపున దేవస్థానం వారు ఘనంగా దుశాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్య నిర్వహకులు పేరూరు శ్రీనివాసరావు, సన్ శెట్టి సుబ్బా రావు, బైసాని సుబ్బారావు, కాకుమాను కోటేశ్వరరావు, కూచి రామాంజనేయులు, దేవస్థాన పూజారి రంగాలకు గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో పెన్షన్ల కోసం బారులు

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ పట్టణంలోని ఓ సచివాలయంలో పెన్షన్ల కోసం బారులు తీరిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు

ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాల యం నందు వాసవి కిరాణా మర్చెంట్ అసోసియేషన్, మెడికల్ అసోసి యేషన్, డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్, క్లాత్&రెడిమెడ్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం కార్యక్రమంలో సభను ఉద్దేశించి ప్రసంగించిన వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడుతో పాటు నియోజకవర్గ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

భాష్యం ప్రవీణ్‌ను ఆశీర్వదించండి

విశాలాంధ్ర-పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మంగళ వారం తెలుగుదేశం, జనసేన, బిజెపి పెదకూరపాడు నియోజకవర్గ ఉమ్మడి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య తాళ్లూరు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ భాష్యం ప్రవీణ్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలను మీ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుకు వేసి ఆశీర్వదించాలంటూ ప్రచారం నిర్వహించారు.